# VC NEWS వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 28 ఫిబ్రవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 193

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## రచ్చకెక్కిన విజయ్ వ్యక్తిగత జీవితం



భర్తతో మానసికంగా ఐదేళ్లుగా దూరంగా ఉన్నట్లు సంగీత వెల్లడి

ఇక వేగలేనంటూ చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకులకు దరఖాస్తు

రాజకీయంగా దెబ్బేనంటున్న పరిశీలకులు

2లో..

# దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పు




న్యూఢిల్లీ: 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో దేశ ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. గతేడాది 7.4శాతం కన్నా పెరిగినట్లు కేంద్రం శుక్రవారం తెలిపింది. నూతన జీఎస్‌టి సిరీస్ ప్రకారం ఆర్థిక అంచనాల కోసం 2022-23ని బేసిక్ ఇయర్‌గా తీసుకున్నట్లు తెలిపింది. గతంలో ఇది 2011-12గా ఉండేది. ÷ఔతన సిరీస్ ప్రకారం ప్రస్తుత సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 7.6శాతంగా అంచనా వేసినట్లు గణాంకాల మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది జనవరిలో అంచనా విడుదలైన అంచనాల ప్రకారం.. ఇది 7.4శాతంగా ఉంది. 2025-26 జులై-సెప్టెంబర్ కాలానికి వృద్ధి రేటును 8.2శాతం నుండి 8.4శాతానికి పెంచారు. అయితే మొదటి త్రైమాసికంలో వృద్ధి రేటును 7.8శాతం నుండి 7.6శాతానికి తగ్గించారు.

### చిలుకూరు పూర్వ ప్రధానార్చకులు

## సౌందర్ రాజన్ కన్నుమూత

### మృతికి పలువురు ప్రముఖులు సంతాపం



హైదరాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ పూర్వ ప్రధాన అర్చకుడు సౌందర్ రాజన్ (90) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యల కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం చిలుకూరులోని నివాసంలో కన్నుమూశారు. ఈ మేరకు ఆయన తనయుడు, ఆలయ ప్రస్తుత ప్రధాన అర్చకుడు రంగరాజన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఈ ప్రసిద్ధ ఆలయాన్ని సౌందర్ రాజన్ ఎంతో కాలం క్రమశిక్షణతో, సేవానిరతితో నిర్వహించారు. భక్తులతో మమేకమై స్వామి వారి ప్రసాదాన్ని, సేవా విధానాన్ని ఎంతో ప్రశాంతంగా వివరించేవారు. వీసా దేవుడిగా చిలుకూరి ఆలయాన్ని ఆయన ప్రసిద్ధి పొందేలా చేశారు. ఇక్కడ భక్తులందరికీ ఒకేతరహా దర్శనంతో అవకాశ కల్పించారు. హుండీ లేకుండా చేశారు. భక్తులు నేరుగా దర్శనం కలిగించుకునేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించినా కోర్టుల ద్వారా దివంగత సౌందర్ రాజన్ పోరాడి అడ్డుకున్నారు.



2లో..

## విద్యా కమిషన్‌లో విద్యావేత్తలేరీ ?

విద్యావేత్తలే లేని కమిటీ నివేదికతో సాధించేదేమిటి

బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



కేజ్రీవాల్, కవితకు క్లీన్‌చిట్ మనీశ్ సిసోదియా, మరో 20 మందికి కూడా విముక్తి ఢిల్లీ మద్యం కేసులో రౌజ్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు సీబీఐ అభియోగాలు నిరాధారమంటూ కొట్టివేత అవి న్యాయ పరిశీలనకు నిలవలేదని స్పష్టీకరణ కోర్టు వెలుపల కన్నీటి పర్యంతమైన ఆప్ అగ్రనేత ప్రత్యేక జడ్జి తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ



## న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం

# నిలబడింది

కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా

కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు

ఢిల్లీ కోర్టు తీర్పుపై కవిత హర్షం

కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది.



2లో..



2లో..

## రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా.. నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే

పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందనన కెటిఆర్

వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్



2లో..

## జుబ్లీహిల్స్ ఫ్లై ఓవర్ పనులు

# ప్రారంభం

ట్రాఫిక్ మళ్లింపు చేపట్టిన పోలీసులు

పనులు పరిశీలించిన సిపి సజ్జన్నార్

బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, ఫ్లై ఓవర్ ఓవర్లు అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

సాయుధ పోరాటాన్ని విరమిస్తాం..

పీఎల్‌జీఏనూ రద్దు చేస్తాం లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతల వెల్లడి

సచివాలయంలో సీఎంతో భేటీ అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తానన్న రేవంత్‌రెడ్డి



## కేంద్రం సహకరిస్తే రాజకీయ పార్టీగా

# మారుస్తాం

దేవ్‌జీ, రాజిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే సాయుధ పోరాటాన్ని విరమిస్తామన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)ని కూడా రద్దు చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజా జీవితంలోనే ఉండి, చట్టపరంగా ఉద్యమ పంథా కొనసాగిస్తామని స్పష్టం చేసిన దేవ్‌జీ తాము రాజకీయంగా పురోగమించేందుకు ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్రం సహకరించాలన్నారు. ఇలా చేస్తే మావోయిస్టు పార్టీని రాజకీయ పార్టీగా మారుస్తామన్నారు.

**హైదరాబాద్:** ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఒకవైపు... ఈ ప్రజాస్వామ్యం అంతా బూటకం, సాయుధ తిరుగుబాటు ద్వారానే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఇటీవలి కాలం వరకు తుపాకులతో పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు మరోవైపు... వీరిరువురి చరిత్రాత్మక కలయికకు సచివాలయం వేదికైంది. డీజీపీ మొదలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో దాదాపు గంటపాటు వీరి మధ్య అనేక ఆసక్తికరమైన అంశాలపై శుక్రవారం చర్చ జరిగింది. లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించగా..తన పరిధిలోని అంశాలను తప్పకుండా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండి పోరాటం చేసిన మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ ఎలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నలు ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. వీరితో పాటు గతంలో లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ ఎలియాస్ చంద్రన్న, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి ఎలియాస్ సుజాతక్క శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు.

# విద్యా కమిషన్‌లో విద్యావేత్తలేరీ ?



హైదారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్‌లో అనుభవమున్న విద్యావేత్తలు లేరని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో స్కూల్ పిల్లలకు గానీ, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదికపై హరీష్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు విద్యావేత్తలే లేని కమిటీని వేసి, వారితో విద్యా విధానంపై నివేదిక ఇప్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యా కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు ఎక్కడ అని ప్రశ్నించారు. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు మినహా, ఎడ్యుకేషన్ లో పీహెచ్‌డీ చేసిన వాళ్లు కానీ, స్కూల్ సిలబస్ తయారీలో, కోర్ సైన్స్ సబ్జెక్టుల్లో పట్టున్న వాళ్లు కానీ ఈ కమిటీలో ఒక్కరైనా లేరని పేర్కొన్నారు. ఈ కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అని పైగా ఆయనొక ఇంజనీర్ అని అన్నారు. ఆఫీసులు నడపడం వేరు. చదువులు చెప్పడం వేరు. పరిపాలనలో అనుభవం ఉన్నంత మాత్రాన. పిల్లల సైకాలజీ, పాఠాలు చెప్పే పద్ధతుల మీద పూర్తి అవగాహన ఉన్నట్టా. తెలంగాణ విద్యా భవిష్యత్తును మార్చేంత అర్హత, నైపుణ్యం ఈ కమిటీకి ఉందని మీరు నిజంగానే నమ్ముతున్నారా అంటూ ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన విద్యా కమిషన్‌లో విద్యావేత్తలు, అనుభవం ఉన్న టీచర్లు, పిల్లల మనస్తత్వం తెలిసిన చైల్డ్ సైకాలజిస్టులు, సబ్జెక్ట్ నిపుణులు లేకుండానే రాష్ట్రానికి ఏకంగా ఒక కొత్త విద్యా విధానాన్ని తయారు చేయొచ్చనే గొప్ప ఆలోచన మీకే దక్కుతుందని పేర్కొన్నారు.సిలబస్ ఎలా ఉండాలి, బోధనా పద్ధతులు ఎలా ఉండాలి అనేది గ్రౌండ్ లెవెల్లో పాఠాలు చెబుతున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ కు తెలుస్తుంది కానీ.. అసలు ఆ సంబంధమే లేని అధికారులకు, వేరే రంగాల వారికి ఎలా తెలుస్తుందని నిలదీశారు. విద్యావ్యవస్థ మీద కనీస అవగాహన లేకుండా, అర్హత లేని వారితో ప్రయోగాలు చేయడం అంటే తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి ఎంత నిర్లక్ష్యంగా గాలికి వదిలేశారో చెప్పడానికి ఈ కమిటీ ఏర్పాటే ఒక ఉదాహరణ అని విమర్శించారు. కొత్త విద్యా విధానం విషయంలో తెలంగాణలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పారదర్శకతను కోరుకుంటున్నారని తెలిపారు. గడిచిన రెండేండ్లుగా విద్యాశాఖను గాలికి వదిలేసి, సబ్జెక్ట్ తెలిసిన విద్యావేత్తలకు ఈ బాధ్యత అప్పగించకుండా, సంబంధం లేని వారితో కమిటీ వేసి కాలయాపన చేసి ఏం సాధించినట్లని ఆరోపించారు. వేసిన కమిటీ ఎంత గొప్పగా ఉంటే, వారిచ్చిన నివేదిక ఇంకెంత గొప్పగా ఉంటుందో అర్థమవుతున్నదని, విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

# విషాద కవితలెప్పుడూ పాఠకుల మనసుని ఏదో తెలీని వేదనతో విచలితం చేస్తాయి !

**జీవన సహచరి నిష్క్రమణతో గుండె నిండా గూడు కట్టుకున్న బెంగ .. ఆప్తుల ఆగమనంతో శీతల పవనం సోకిన మబ్బులా భళ్ళున వర్షిస్తుంది !తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్స్ లర్ డా.ఎన్.గోపి గారు తన జీవన సహచరి 'ఎన్.అరుణ' గారి ఎడబాటుని తట్టుకోలేక , ఆమె గతించిన ఈ అయిదు నెలల కాలంలో-వారానికో కవిత చొప్పున తాను రాసిన ఇరవై కవితలతో .. 'సతీ స్మృతి' పేరిట ఒక కవితా సంపుటిని వెలువరించారు.**

**'సతీస్మృతి'!**
ఆ పేరే చాలు – ఆ
దంపతులిద్దరి మధ్యున్న
ప్రేమానురాగాలు ఎంత
గొప్పవో చెప్పటానికి !
ఆ సంపుటిలో ఒక్కో కవిత
ఒక్కో ఆణిముత్యం !
మచ్చుకి కొన్ని కవితలలోని
కొన్ని పంక్తులు !
శూన్యం అంటే
ఏమిటో తెలిసింది
నిస్సహాయత
నివ్వెరపోయి నిలిచింది
పంచుకోవడానికేమీ లేదు
తుంచుకుని వెళ్ళిపోయింది
నా కొడుకు
బూడిదలోంచి
వాళ్ళమ్మ ఎముకల్ని
ఏరుతున్నాడు
వాటికి ఆమె దేహం వెచ్చదనం
ఇంకా పోలేదు.
అది ఆమెని
కౌగిలించుకుని పడుకున్న
ప్రేమ కాబోలు

**ప్రియతమా!**
ఈ పాతాళంలో నేనుండలేను
నన్ను పైకి చేదుకో !

**బుజ్జీ !**
నువ్వున్నప్పుడు
రోజులు పువ్వుల్లా పూచేవి
ఇప్పుడు
రాలుతున్న ఆకుల్లా వున్నాయి.
ఇంత బాధ

**ఎవరికీ రావద్దు !**
అన్నం
దుఃఖంలో
అద్దుకుని తిన్నట్టుంది.
సాయంత్రం
నిద్రలోనే నీ నిష్క్రమణం
తెలిస్తే
పోనివ్వననేమో
నిశ్శబ్ద గమనం
నువ్వు ఇష్టంతో
కట్టించుకున్న ఇల్లు
ఇవాళ నీ స్మృత్యర్థం నిర్మించిన
సమాధిలా వుంది

**తట్టుకోవడం కష్టం !**
నాకిప్పుడు
ముది మది తప్పితే
బావుండును
నన్ను నేను పోల్చుకోలేని
కన్నులు మొలిస్తే బాగుండును.

కళ్ళు వాచిపోయాయి
రాలుతున్నవి పూలు కాదు
ఆమె ఖాళీ చేసిన ఇల్లు
అనుక్షణం గుచ్చుకునే
రేగు ముల్లు.
ఎవరైనా
ఎప్పుడైనా పొయ్యేదే
అంటారు మిత్రులు
నిజమే
హంస ఎగిరిపోయింది
చిత్ర హింస మాత్రం
మిగిలింది.

**స్వర్గీయ ఎన్.అరుణతో నా పరిచయం :**
మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ ఎమ్. నారాయణ రెడ్డి గారు , ఎమ్మెల్సీ స్వర్గీయ ఎమ్ ,గంగారెడ్డి గారు నెలకొల్పిన విమెన్స్ కాలేజీ , నిజామాబాదులో నాతో పాటు చదువుకున్న అరుణ గారు నా కన్నా ఓ సంవత్సరం సీనియర్ . చక్కగా ఎన్నో పాటలు పాడేవారు. మంచి కవితలు కూడా రాసేవారు. కవిత్వంలో 'అపురూప' అవార్డు కూడా అందుకున్నారు. నాకు అత్యంత ఆప్తులు !



డా.అమృతలత.

# రచ్చకెక్కిన విజయ్ వ్యక్తిగత జీవితం



చెన్నై:తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్‌వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. ఆయన భార్య సంగీత సంచలన ఆరోపణలు చేశారు. ఐదేళ్ల కిందటే తాము మానసికంగా విడిపోయామని విజయ్ భార్య సంగీత అన్నారు. విజయ్‌కి ఓ నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపించారు. ఆ నటితో విదేశాలకు, పార్టీలకు విజయ్ వెళ్తారని చెప్పుకొచ్చారు. విజయ్ తనను వేధింపులకు గురి చేస్తున్నారని.. ఇది ఇలాగే కొనసాగితే ఆ నటి పేరు బయటపెడతానంటూ సంగీత హెచ్చరించారు. వివాహేతర సంబంధం ఓ ద్రోహమని సంగీత ఫైర్ అయ్యారు. విజయ్ వివాహేతర సంబంధం గురించి 2021లో తెలిసిందని అన్నారు. ఆ నటితో సంబంధం తెంచుకుంటానని విజయ్ తనతో చెప్పారని ప్రస్తావించారు. మాట తప్పి ఆ సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పదేపదే తమ మధ్య విభేదాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. ఆ నటికి మద్దతుగా విజయ్ మాట్లాడుతూ వచ్చారని.. ఆయన నిర్లక్ష్యం కారణంగా తాను ఒంటరినయ్యానని సంగీత పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన భార్య సంగీత చెంగల్‌పట్టు కుటుంబ న్యాయస్థానంలో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివాహ జీవితం సజావుగా కొనసాగడం లేదని, వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానం ఈ పిటిషన్‌ను స్వీకరించగా.. ఏప్రిల్ 20వ తేదీన కోర్టుకు హాజరుకావాలని విజయ్‌కు నోటీసులు జారీ చేసింది.

విజయ్, సంగీత వివాహం 1999లో జరిగింది. సంగీత లండన్‌కు చెందిన తమిళ కుటుంబానికి చెందినవారు. విజయ్ నటుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయన అభిమానిగా సంగీత పరిచయం అయ్యారు. ఆ పరిచయం ప్రేమగా మారింది. కుటుంబ సభ్యుల సమ్మతితో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, వివాహమైన కొంతకాలం తర్వాతే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు ప్రారంభమైనట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా వీరిద్దరూ వేర్వేరుగా జీవిస్తున్నారని సినీవర్గాల్లో ప్రచారం ఉంది. ప్రత్యేకంగా విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చాయని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు సంగీత విడాకులు కోరుతూ పిటిషన్ వేయడంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. విజయ్, త్రిషకు మధ్య సంబంధం ఉందంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల తమిళనాడుకు చెందిన కొందరు రాజకీయ నేతలు సైతం ఇవే కామెంట్స్ చేశారు. విజయ్ త్రిష ఇంటిని విడిచి ప్రజల్లోకి రావాలంటూ బీజేపీ నాయకుడు నయినర్ నాగేంద్రన్ కామెంట్ చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు తమిళనాట పెద్ద వివాదానికి దారి తీశాయి. ఈ వ్యాఖ్యలపై త్రిష తీవ్రంగా స్పందించడం.. ఆ తర్వాత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పడంతో వివాదం కాస్త సద్దుమణిగింది. ఇంతలో సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో.. విజయ్ – త్రిష రిలేషన్ ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లయ్యింది. విజయ్ ఇటీవలే రాజకీయాల్లోకి ప్రవేశించి తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని ఆయన రాజకీయ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారు. ఈ సమయంలో వ్యక్తిగత జీవితంలో ఇలాంటి పరిణామం చోటుచేసుకోవడం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందా అనే చర్చ జరుగుతోంది. అయితే, విజయ్ అభిమానులు మాత్రం ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు. విజయ్ తమిళ సినీ పరిశ్రమలో అత్యంత ప్రజాదరణ పొందిన నటుల్లో ఒకరు. ఆయన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఈ వార్త అభిమానులను కలవరపరిచింది. సోషల్ మీడియాలో అభిమానులు తమ స్పందనలు తెలియజేస్తున్నారు. ం

# జూబ్లీహిల్స్ ఫ్లై ఓవర్ పనులు ప్రారభం



హైదరాబాద్‌బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లో పార్క్ హయత్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులని మేఘా నిర్మాణ సంస్థ ప్రారంభించింది. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమైన ప్రాంతాన్ని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా శుక్రవారం నుంచి పలుమార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇందులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఏడు ఏడుఫ్లై ఓవర్ అండర్ పాసుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ రోజు పనులు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇవాళ నుంచి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. ఇప్పటికే వాహనదారులకు పలు సూచనలు చేశామని అన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్లాన్ చేశామని తెలిపారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా లాన్ చేశామని చెప్పుకొచ్చారు. వర్ నిర్మాణ సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో నిర్మాణ పనులు దశల వారీగా జరుగుతాయని వెల్లడించారు. రాత్రి వేళ ఎక్కువగా పనులు చేయాలని నిర్మాణ సంస్థలను కోరామని అన్నారు. బేస్‌మెంట్ పూర్తి అయితే తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు సవరించే అవకాశం ఉంటుందని తెలిపారు. 7 అండర్ పాసులు, ఫ్లై ఓవర్ ఓవర్లు అందుబాటులోకి వస్తే ఆయా రోడ్లు సిగ్నల్ ఫ్రీగా మారుతాయని హైదరాబాద్ సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బీఆర్ పార్కు చుట్టూ 7 ఫ్లై ఓవర్లు, ఏడు అండర్ పాసుల నిర్మాణం ప్రారంభమైందని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. ఈ సందర్భంగా జోయల్ డేవిస్ మాట్లాడుతూ నిర్మాణ పనులను దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశామని అన్నారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనాలు శ్రీనగర్ కాలనీ, ఇంద్రానగర్ బస్తీ మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లాలని జోయల్ డేవిస్ సూచించారు. మాసబ్ ట్యాంక్ నుంచి కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెళ్లే వాహనాలు రోడ్ నెంబర్– 45 మీదుగా వెళ్లాలని అన్నారు. రెండున్నర నెలలపాటు బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లో పిల్లర్స్ పనులు కొనసాగుతాయిని వివరించారు. రెండున్నర నెలలపాటు కొంత ట్రాఫిక్ సమస్య ఉంటుందని.. పరిస్థితులను బట్టి ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. పీక్ అవర్స్‌లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభమైనందున వాహనదారులు పోలీసులకు సహకరించాలని జోయల్ డేవిస్ కోరారు.

# న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది



హైదరాబాద్:న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత అన్నారు. తను నిందితురాలిగా ఉన్న ఢిల్లీ మద్యం కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు మొదట్నుంచి చెబుతున్నాను. అలాగే వచ్చాను. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. అదే నిజమైంది. దీంతో నేను, నా కుటుంబం కొన్ని నెలలపాటు క్షోభ అనుభవించాం. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారు. కోర్టు తీర్పు రాకుండానే నాపై కొందరు అనుచితంగా మాట్లాడారు. కష్ట సమయంలో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను అని కవిత అన్నారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చీట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కవిత స్పందించారు. కవిత మాట్లాడుతూ.. నిజం గెలిచింది.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చా.. నా తల్లిదండ్రులు, అత్తామామలు మాకు అండగా నిలిచారు.. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని టా÷–గ్గ్గ÷ట్ చేయడానికే ఈ కేసు పెట్టారు.. నన్ను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు.. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైంది.. నాకు అండగా నిలిచిన వారిని మరిచిపోను అంటూ కవిత భావోద్వేగానికి గురైంది.

# మా పెళ్లి విందుకు రండి

## మోడీ అమిత్‌షాలను ఆహ్వానించిన విరోషా జంట



న్యూఢిల్లీ: గురువారం పెళ్లి చేసుకున్న హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందన్న రిసెప్షన్ ఏర్పాట్లలో ఉన్నారు. గురువారం ఉదయం 10.10 గంటలకు మూడు ముళ్ల బంధంతో ఇద్దరూ ఒక్కటయ్యారు. ఉదయ్‌పూర్‌లోని ఐటీసీ మెమెంటోస్‌లో వీరి పెళ్లి జరిగింది. ఉదయం తెలుగు సంప్రదాయం ప్రకారం.. సాయంత్రం కొడవ సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి అతి కొద్ది మంది బంధుమిత్రులను మాత్రమే ఆహ్వానించారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో చాలా గ్రాండ్‌గా రిసెప్షన్ నిర్వహించనున్నారు. రిసెప్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. విజయ్, రష్మికలు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. మార్చి 4వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రిసెప్షన్‌కు రావాలని ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం అందించారు. అనంతరం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిశారు. పెళ్లి రిసెప్షన్‌కు రావాలని అహ్వానించారు. ఈ సందర్భంగా ఇన్విటేషన్‌తో పాటు వినాయకుడి విగ్రహాన్ని కూడా ఆయనకు అందించారు. విజయ్, రష్మికల జంట ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# నటుడు సంజయ్‌దత్‌తో లోకేశ్ భేటీ




అమరావతి:ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాలీవుడ్ ప్రముఖ నటుడు సంజయ్ దత్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ విషయాన్ని లోకేశ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా వెల్లడించారు. సంజయ్ దత్‌ను కలవడం ఆనందంగా ఉందని, ఏపీలో సినిమా రంగ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలిపారు. తన పాదయాత్ర సందర్భంగా రూపొందించిన పుస్తకాన్ని సంజయ్‌కు అందచేశారు.

# రెండేళ్ల తరవాత మరోమారు వివేకా హత్యకేసు విచారణ

కడప:మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో రెండేళ్ల తర్వాత సీబీఐ మరోసారి విచారణ చేపట్టింది. ఈ కేసులో నిందితులు సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్‌కుమార్, భరత్‌కుమార్ యాదవ్ సోదరుడు మహేంద్ర యాదవ్‌ను విచారణకు రావాల్సిందిగా ఇప్పటికే నోటీసులు ఇచ్చింది. తాజాగా కడప జిల్లా పులివెందుల పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న సీబీఐ అధికారులు వారిని విచారించనున్నారు. మహేంద్ర యాదవ్ విచారణకు హాజరు కాగా.. కిరణ్ యాదవ్ సాయంత్రం 4 గంటలకు విచారణకు రానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సుప్రీం కోర్టు సూచనల మేరకు కిరణ్ యాదవ్– అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన కాల్ డేటాపై సీబీఐ విచారణ చేయనుంది. వివేకా హత్య జరిగిన రోజు తెల్లవారుజామున 1.42 గంటలకే అర్జున్ రెడ్డికి కిరణ్ యాదవ్ వాట్సాప్ కాల్ చేశాడు. వీరిద్దరి ఫోన్ సంభాషణపై సీబీఐ అధికారులు విచారణ చేయనున్నారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో వీరిద్దర్నీ సీబీఐ అధికారులు ప్రశ్నించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా..నడిగడ్డ బిఆర్ఎస్ వెనకే




హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్ఎస్ పైనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దులా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెద్దులుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యాములు పేల్చడం, ఫ్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వరంగల్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం

హైదరాబాద్: వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనుల్లో జాప్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రజారోగ్యంపై ఎందుకంత నిర్లక్ష్య ధోరణి అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. 2021 జూన్ 21వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. 24 అంతస్తులతో రెండు వేలకు పైగా పడకల సామర్థ్యంతో పలు జిల్లాల ప్రజలకు సేవలు అందించేలా ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూపకల్పన చేశామని తెలిపారు. రెండేళ్లలో 75 శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. 2023 వరకు కూడా ఈ ప్రాజెక్టు వేగంగా సాగిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులు నెమ్మదించాయని చెప్పారు. కావాలనే ఈ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు.

# శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ పురోగతి.




- సిరికొండ ఎంఇఓ పి. రాములు. సత్యశోధక్ పాఠశాలలో 'శాస్త్రీయ విజ్ఞాన ప్రదర్శన--2026' ప్రారంభం.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ పురోగతి సాధ్యమని, ప్రశ్నించే మనసే ప్రగతికి తొలి మెట్టు అని సిరికొండ మండల విద్యాధికారి పి. రాములు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం (ఫిబ్రవరి 28) సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 'శాస్త్రీయ విజ్ఞాన ప్రదర్శన--2026' కార్యక్రమాన్ని ఎంఇఓ పి. రాములు, పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఓ పి. రాములు మాట్లాడుతూ, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత పెంపొందించడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించి పరిష్కార మార్గాలు కనుగొనగల సామర్థ్యం యువతలో పెంపొందాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు వారి ప్రతిభ, సృజనాత్మకతకు నిదర్శనమని ప్రశంసించారు. ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య గారు మాట్లాడుతూ, అన్వేషణా స్ఫూర్తి విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని, విజ్ఞాన శాస్త్రం వ్యక్తిగత వికాసానికి మాత్రమే కాకుండ సమాజ శ్రేయస్సుకు కూడా పునాది అని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు వారి ప్రతిభ, సృజనాత్మకతకు నిదర్శనమని ప్రశంసించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు, పునరుత్పాదక శక్తి నమూనాలు, వ్యవసాయ ఆధారిత సాధనాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఆవిష్కరణలు మరియు జ్ఞాన ముగ్గులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాసం మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





# పీఎంశ్రీ అమలు, సౌకర్యాలపై పరిశీలన

- సంతృప్తి వ్యక్తం చేసిన డిపార్ట్మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ కేంద్ర జాయింట్ సెక్రటరీ దేవేంద్ర కుమార్ రాయ్.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న పీఎం శ్రీ పథకం అమలు, సౌకర్యాలపై పరిశీలన నిమిత్తం కేంద్ర జాయింట్ సెక్రెటరీ దేవేంద్ర కేంద్రీయ విద్యాలయ నిజామాబాద్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న స్మార్ట్ క్లాస్‌రూములు, డిజిటల్ ల్యాబ్‌లు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్ సదుపాయాలు, శుద్ధి చేసిన తాగునీరు, పరిశుభ్రమైన శౌచాలయాలు, క్రీడా వసతులు వంటి మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గణిత, విజ్ఞాన ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో చేపడుతున్న మొక్కల నాటడం కార్యక్రమం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, విద్యార్థులు స్వయంగా చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ కార్యక్రమాలు ఆయనను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రకృతి పట్ల చూపుతున్న ఆసక్తి మరియు సేంద్రియ వ్యవసాయం ద్వారా పర్యావరణ అవగాహన పెంపొందించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పీఎంశ్రీ పథకం ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

పాఠశాల నిర్వహణ, బోధనా విధానాలు మరియు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై జాయింట్ సెక్రెటరీ సంతృప్తి వ్యక్తం చేస్తూ, పీఎం శ్రీ పథకం లక్ష్యాలను సక్రమంగా అమలు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ పథకం మరింత తోడ్పడాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ వెంట రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విజయలక్ష్మి బాయి, శ్రీనాథ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి.

**వేసవిలో దాహార్తి సమస్య తలెత్తకూడదు.**

**అధికారులతో అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 27**



: నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ హాల్ లో శుక్రవారం వారు సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై, నగర ప్రగతిపై సమీక్ష జరిపారు. ఆయా శాఖల వారీగా మంజూరైన పనుల గురించి ప్రస్తావిస్తూ, ప్రస్తుతం అవి ఏ దశలో ఉన్నాయి, ఏ మేరకు నిధులు ఖర్చు చేశారు, ఎక్కడెక్కడ సదుపాయాల పునరుద్ధరణ జరిగింది తదితర వివరాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు డివిజన్లలో సీ.సీ, బీ.టీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులు, రోడ్ల నిర్మాణాలు పెండింగ్ లో ఉండగా, వాటిని వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా దాహార్తి సమస్య నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అమృత్ పథకం కింద కొత్తగా 18 మంచి నీటి ట్యాంకులకు గాను 14 ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయని, మిగితా నాలుగు ట్యాంకుల పనులను కూడా త్వరగా జరిపించాలని అన్నారు. అదేవిధంగా మంచినీటి పైప్ లైన్ విస్తరణ, భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మహా ప్రస్తానం ఆకృతిలో స్మశాన వాటికను నిర్మించాలని, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ సముదాయాలను పూర్తి చేయించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు పాటుపడుతూ, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పీ.ఎంశ్రీ నిధులతో అర్బన్ ఏరియాలోని ఆరు పాఠశాలల్లో చేపట్టిన పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయించాలని అన్నారు. పన్నులను నూటికి నూరు శాతం వసూలు చేస్తూ, ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్బన్ లో ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు వేగంగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా అవసరమైన తోడ్పాటును అందించాలని అధికారులకు సూచించారు. కాగా, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సమీక్షా సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్ని ఇబ్బందులు ఎదురైనా....

# చదువును ఆపొద్దు

**విద్యార్థినులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉద్బోధ**

**కోటగల్లి బాలికల పాఠశాలలో**


**పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లు పంపిణీ**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 27 :**




ఎన్ని ఇబ్బందులు ఎదురైనా...చదువును అర్ధాంతరంగా ఆపొద్దని, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో చక్కగా స్థిరపడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినులకు ఉద్బోధ చేశారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు సంయుక్తంగా 60 వేల పునర్వినియోగ సానిటరీ ప్యాడ్లను బాలికలకు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం కోటగల్లి బాలికల పాఠశాలలో 650 మంది బాలికలకు సానిటరీ ప్యాడ్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఈ ప్యాడ్లను ఏడాది కాలం పాటు పునర్వినియోగం చేసుకోవచ్చని, వీటిని వాడిన అనతరం శుభ్రపర్చుకుని చక్కగా ఆరబెట్టుకుంటే, తిరిగి వాటినే వినియోగించుకోవచ్చని సూచించారు. నెలసరి విషయంలో బాలికలు ఆందోళనకు లోను కావద్దని, మహిళలకు ఇది ప్రకృతి సహజంగా జరిగే పరిణామమని అన్నారు. హార్మోన్ల సమతుల్యత లోపిస్తే వైద్య పరీక్షలు జరిపించుకోవాలని సూచించారు. బాలికలు వ్యక్తిగత శుభ్రతను పాటిస్తూ, ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని, బలవర్ధకమైన ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం, గౌరవం లభిస్తుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్జనను కొనసాగించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్.బీ.ఐ రీజినల్ మేనేజర్ మహేశ్వరం, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సునీల్, పాఠశాల హెచ్.ఎం సాయరెడ్డి, ఎస్.బీ.ఐ, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథం ఒక సామాజిక అవసరం




శాస్త్ర విజ్ఞానం అంటే ప్రయోగశాలలో ఉండే విషయం కాదని అది సమాజ అభివృద్ధికి దారి చూపే శక్తి అంటారు భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి రామన్.ఈ భావనను ఆయన తన జీవితంలో చేసిన కృషి ద్వారా నిరూపించారు.

సర్ చంద్రశేఖర వెంకట రామన్ నవంబర్ 7, 1888 న తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. ఆయన తండ్రి చంద్రశేఖర్ అయ్యర్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు. అందుకే ఆయన ఇంట్లో విజ్ఞాన శాస్త్ర ఆలోచనలు ఉండేవి. చిన్నప్పటి నుంచే రామన్ కు విజ్ఞాన శాస్త్రం పై ఆసక్తి ఎక్కువ అదే ఆసక్తితో 11 ఏళ్ల వయసులోనే అత్యంత ప్రతిభావంతంగా మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. చెన్నైలోని ప్రెసిడెన్సీ కాలేజీలో చదివి భౌతిక శాస్త్రంలో బి.ఏ ఎం.ఏ పట్టాలు ఉత్తమ ప్రతిభతో సాధించారు.

ఆ తర్వాత ఆయనకు పరిశోధనలపై ఎంతో ఆసక్తి ఉన్నా ఆర్థిక పరిస్థితుల రీత్యా ఇండియన్ ఫైనాన్స్ సర్వీస్ లో ఉద్యోగంలో చేరాడు. కలకత్తాలో పనిచేస్తున్నప్పుడు ఖాళీ సమయాల్లో అక్కడి ×బాజా లో ప్రయోగాలు చేసి, తన పరిశోధనలతో, ప్రపంచ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించారు. తర్వాత ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి పూర్తిస్థాయి శాస్త్రవేత్తగా మారారు.అలా పరిశోధిస్తూ 1928లో రామన్ ప్రభావమును కనుక్కున్నారు. రామన్ ప్రభావం అంటే కాంతి ఒక పారదర్శక పదార్థం గుండా ప్రయాణించే సమయంలో దాని తరంగ ధైర్ఘ్యం మారడం. తద్వారా కాంతి రంగు మారడం. ఈ ఆవిష్కరణకు గాను కేవలం రెండు సంవత్సరాల అనంతరం 1930లో సి.వి రామన్ కు నోబెల్ బహుమతి లభించింది.భారతదేశం నుంచి విజ్ఞాన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు ఆయనే. అందుకే రామన్ ప్రభావమును కనుగొన్న రోజునే భారత జాతీయ విజ్ఞాన దినోత్సవం గా జరుపుతారు. ఒక పరిశోధన అంశం కనుగొన్న రోజున జాతీయ విజ్ఞాన దినోత్సవం జరపటం ఆ పరిశోధనకు దక్కిన గౌరవంగా భావించవచ్చు. అంతేగాకుండా సముద్రంలోని నీరు నీలం రంగుగా ఉండడంపై ,సంగీత వాయిద్యాలలో వచ్చే ధ్వని పై కూడా ఆయన పరిశోధనలు చేశారు.

అయితే రామన్ కేవలం భౌతిక శాస్త్రవేత్తగా మనం చూస్తే ఆయన కృషికి సార్థకత ఉండదు. ఆయన శాస్త్రీయ దృక్పథానికి ప్రాధాన్యతనిచ్చారు శాస్త్రీయ దృక్పథం అంటే ప్రతి విషయాన్ని హేతుబద్ధంగా పరిశీలనాత్మకంగా ఆలోచించడం.అపోహలకు, ఊహలకు ప్రాధాన్యతనివ్వకుండా నిజాన్ని ఆధారాలతో సహ తెలుసుకోవడం. పరిశోధన అనుభవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం. ఈ అంశానికి రామన్ చాలా ప్రాముఖ్యతను ఇచ్చారు .అందుకే భారత విద్యారంగంలో మార్పుల గురించి ఆయన స్పష్టంగా ఉన్నారు.విద్యార్థులు పుస్తకాలలో ఉన్న అంశాలను కంఠస్థం చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. విద్యార్థులు ప్రయోగాల ద్వారా, అనుభవాల ద్వారా విజ్ఞానాన్ని నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకోవాలని అనేవారు. ప్రశ్నించే స్వభావం ఉంటేనే శాస్త్రీయ దృక్పథం ఏర్పడుతుందని కొత్త ఆవిష్కరణలకు పునాది పడుతుందని ఆయన నమ్మకం. సమాజంలో అజ్ఞానం తొలగాలంటే విద్యా వ్యవస్థలో మార్పులు అవసరమని ఆయన చాలా సందర్భాల్లో తన ఉపన్యాసాలలో చెప్పారు.

మూఢనమ్మకాలు, అపోహలు సమాజాన్ని వెనక్కి లాగుతాయని రామన్ సూచించారు. శాస్త్రీయ దృక్పథం పెరిగితే ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించి, సరైన నిర్ణయాలు తీసుకోగలరని ఆయన అభిప్రాయం. తద్వారా సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన నమ్మకం. అంతేకాదు ఆయన భారత రాజ్యాంగం చెప్పిన శాస్త్రీయ దృక్పథానికి, విమర్శనాత్మక ఆలోచనల పట్ల కట్టుబడి ఉండేవారు. రామన్ వ్యక్తిగతంగా సాంప్రదాయ భారతీయ సంస్కృతిని గౌరవించారు. కానీ శాస్త్రీయ కార్యకలాపాలు పూర్తిగా శాస్త్రీయ పద్ధతులపై ఆధారపడి ఉండేవి. సైన్స్ కు మతాన్ని కలపకుండా పరిశోధనలు స్వతంత్రంగా కొనసాగించాలి అనే భావన ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన మతానికి బదులుగా మానవత్వానికి,సైన్స్ కు ప్రాధాన్యం ఇచ్చిన శాస్త్రవేత్త. నేటి పరిస్థితుల్లో రామన్ అభిప్రాయాలు చాలా ప్రాధాన్యం గలవి వాటిని శాస్త్రీయ దృక్పథం గల వారందరూ సమాజంలో వ్యాప్తి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

✍✍డా. సరిత పిట్ల,
అసిస్టెంట్ ప్రొఫెసర్(సి),
తెలంగాణ విశ్వవిద్యాలయం.

# పబ్లిక్ స్కూల్స్ పేరుతో.. సర్కార్ బడులపై నిర్లక్ష్యం.

**తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధానాలు. ఆకునూరి మురళి సిఫార్సులను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపడతాం.**

**వేగుచుక్క న్యూస్:**

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సమర్పించిన తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ నివేదికలో కొన్ని సానుకూల అంశాలున్నప్పటికీ, స్థూలంగా చూసినట్లయితే విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా కనిపిస్తుంది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నిర్వహింపబడుతున్నటువంటి విద్యాసంస్థలను బలోపేతం చేసి మౌలిక సౌకర్యాలు కల్పించి, సరిపడా ఉపాధ్యాయులను నియమించాల్సి ఉండగా, మరొక కొత్త విధానాన్ని తీసుకొని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో మండలానికి రెండు మూడు పాఠశాలను 1500 మంది విద్యార్థులతో నెలకొల్పాలని ఆ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించాలని, అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని సంవత్సరానికి 100 పాఠశాలలు నిర్మించుకుంటూ పోతే ప్రస్తుతం ఉన్న సాధారణ పాఠశాలలు ఏమి కావాలి అదే సమయంలో ఆ పాఠశాలకు ఉపాధ్యాయులను ఎలా రిక్రూట్ చేస్తారో చెప్పలేదు. తండాలు మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలను మూసివేసే దిశగా ఆయన సిఫార్సులు ఉన్నాయి. దీనివల్ల పేద బడుగు బలహీన వర్గాలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఇంకొక ప్రధానమైన విషయం ఏమిటంటే ఉపాధ్యాయులపై తనకున్న అక్కస్సు రిపోర్టులో వెళ్ళగక్కారు ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉన్నాయని వీటిని హేతుబద్దీకరించాలని ఆయన అనడం పూర్తిగా హాస్యాస్పదం వేతనాలు ఏ విధంగా నిర్ణయిస్తారు వేతన సంవత్సర ద్వారా శాస్త్రీయంగా అనేక కొలమానాలను పరిశీలించి, ద్రవ్యోల్బణం, వినియోగదారుల సూచి, మొదలగు అంశాల ద్వారా హేతుబద్ధంగా సిఫార్సు చేస్తారు. ప్రభుత్వాల నిర్వాకం వల్ల ఇప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు నాలుగు పిఆర్సీలు ఉద్యోగ ఉపాధ్యాయులు నష్టపోయారు. ఇదంతా పక్కకు పెట్టి కేవలం ఉపాధ్యాయులనే వేతనాలు ఎక్కువగా ఉన్నాయని చూపించి సమాజం దృష్టిలో ఉపాధ్యాయులను పలుచన చేయడం తప్ప మరొకటి కాదు అని చెప్పి భావిస్తున్నాం. ఇక ఉపాధ్యాయుల పదోన్నతుల విషయమై ఇప్పటికే ఒక ఎస్జీటీ ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ పొందడానికి 20, 30 సంవత్సరాలు వేచి చూడాల్సిన పరిస్థితి. అయినప్పటికీ తన మొత్తం సర్వీసులో ఒక ప్రమోషన్ కూడా పొందకుండా పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు ఎందరో ఉమ్మడి సర్వీస్ రూల్స్ పరిష్కారం కాకపోవడం మూలాన పర్యవేక్షక పోస్టులన్నీ ఇన్చార్జిలమయం అయిపోయి పదోన్నతులు పొందలేని పరిస్థితి నెలకొని ఉన్నది. ఇవన్నీ పట్టించుకోకుండా ఏకపక్షంగా సిఫార్సులు చేయడం ఆకునూరి మురళి సంకుచిత స్వభావానికి నిదర్శనం కనిపిస్తున్నది. ఆకునూరి మురళి సిఫార్సులను వ్యతిరేకిస్తూ కలిసిచ్చే సంఘాలను కలుపుకొని ఈ సిఫార్సులకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉన్నది.



✍✍ చకినాల అనిల్ కుమార్,
టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు.

# యాక్షన్ డ్రామా



తెలుగు, తమిళం చిత్రాలతో మంచి గుర్తింపు పొందిన యంగ్ హీరో సందీప్ కిషన్ మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌తో ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. 'స్నేహగీతం', 'ప్రస్థానం' వంటి చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఆయన, విభిన్న కథలను ఎంచుకునే నటుడిగా పేరుపొందారు. కెరీర్ ప్రారంభంలో దర్శకుడు గౌతమ్ మీనన్ తెరకెక్కించిన 'వారణం ఆయిరం' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన సందీప్, తర్వాత హీరోగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. చెన్నైలో జన్మించిన ఆయన లయోలా కాలేజీలో చదువు పూర్తి చేసి సినీరంగంలో అడుగుపెట్టారు. ప్రముఖ ఛాయాగ్రాహకులు ఛోటా కె.నాయుడు, శ్యామ్ కె.నాయుడు ఆయన బంధువులు కావడం విశేషం. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, తెనాలి రామకృష్ణ బీఏ బీఎల్ వంటి చిత్రాలతో మంచి హిట్లు అందుకున్న సందీప్ కిషన్ ఇటీవల ప్రేక్షకుల్ని పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు.

ఇటీవల ఆయన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో మార్కెట్ కొంత తగ్గిందనే ట్రేడ్ వర్గాలు చెబుతున్నా కథల ఎంపికలో కొత్తదనం కోసం మాత్రం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. మంచి కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న సందీప్... టాలెంటెడ్ దర్శకుడు కృష్ణ చైతన్య దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం "పవర్ పేట"లో నటిస్తుండటం సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. 'రౌడీ ఫెలో', 'చల్ మోహన్ రంగ', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాలతో తనదైన ముద్ర వేసిన కృష్ణ చైతన్య ఈ ప్రాజెక్ట్‌ను తన కెరీర్‌లో కీలక చిత్రంగా భావిస్తున్నారు. కంటెంట్ బలంగా ఉండే కథలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడిగా ఆయనకు ఉన్న పేరుతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

నమ్ముతోంది. మరోవైపు సందీప్ ఇప్పటికే విజయ్ కుమారుడు జాసన్ విజయ్‌తో కలిసి 'సిగ్మా' చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. "పవర్ పేట" కథ విషయానికి వస్తే... ఒక సాధారణ వ్యక్తి ఎలా అసాధారణ శక్తిగా ఎదిగి, ఒక ప్రాంతాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకున్నాడనే నేపథ్యంతో సినిమా సాగుతుందని సమాచారం. పాత్ర కోసం సందీప్ కిషన్ తన లుక్, బాడీ లాంగ్వేజ్ పూర్తిగా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. కథలో భాగంగా ఆయన మూడు డిఫరెంట్ షేడ్స్‌లో కనిపించనున్నారని టాక్. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భారీ సెట్స్, ఆర్ట్ వర్క్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విభిన్న కథతో, బలమైన మేకింగ్‌తో "పవర్ పేట" ద్వారా సందీప్ కిషన్ మరోసారి తన రేంజ్ ఏంటో బాక్సాఫీస్‌కు చూపించాలనే లక్ష్యంతో ఉన్నారని టాలీవుడ్‌లో చర్చ నడుస్తోంది. టాలీవుడ్‌లో ప్రస్తుతం పీరియాడికల్ డ్రామాల ట్రెండ్ నడుస్తున్న వేళ సందీప్ కిషన్ ఈ మూవీతో ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి.

# క్రేజీ మల్టీస్టారర్





మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో డైరెక్టర్ అనిల్ రావిపూడి ఇండస్ట్రీ హిట్ కొట్టారు. ఈసారి దొరుకుతాడా లేదా? అనే డిస్కషన్స్ మధ్యలో వచ్చి, మరో బ్లాక్ బస్టర్ సక్సెస్ తన ఖాతాలో వేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారిపోయారు. వరుసగా తొమ్మిది విజయాలు అందుకున్న దర్శకుడిగా అరుదైన ఘనత వహించారు. దీంతో ఆయన 10సినిమాపై అందరి దృష్టి పడింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక వార్తలు ప్రచారంలో ఉన్న తరుణంలో, అనిల్ రావిపూడి తన కొత్త సినిమాను ప్రకటించారు.

విక్టరీ వెంకటేష్ , నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తన నెక్ట్స్ మూవీని తెరకెక్కిస్తున్నట్లు అనిల్ రావిపూడి అధికారంగా ప్రకటించారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మరోసారి స్పష్టం చేశారు. "మొదటి 'వందకోట్ల బొమ్మ' కొట్టిన హీరో వెంకటేష్ గారితో.. 'మొదటిసారి బొమ్మ' తీసే అవకాశం ఇచ్చిన హీరో కళ్యాణ్ రామ్ గారితో కలిసి 2027 మొదటి పండగకి మీ, ముందుకు వస్తున్నాం" అని అనిల్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా వెంకీ – కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన ఓ వీడియోని షేర్ చేసుకున్నారు.

'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ ప్రెస్ మీట్ లోనే అనిల్ రావిపూడి తన నెక్ట్స్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడారు. తన పదో సినిమాకి ఐడియా క్రాక్ అయిందని, ఈసారి టైటిలే చాలా విచిత్రంగా ఉంటుందని, మళ్లీ వస్తున్నాడ్రా అని అనుకుంటారని తెలిపారు.

గత కొన్ని రోజులుగా వెంకటేశ్‌తో సినిమా ఉంటుందని, మలయాళ స్టార్ ఫాహద్ ఫాజిల్ కీ-రోల్ చేస్తున్నాడని, కీర్తి సురేశ్ కథానాయికగా చేస్తోందని, దానికి 'బామ్మర్ది బాల్ రెడ్డి' అనే టైటిల్ ఫైనల్ అయినట్లు వార్తలు వచ్చాయి. కాగా ఇన్నాళ్లు జరిగినట్లు ఫహాద్ కాకుండా ఆయన స్థానంలో కల్యాణ్ రామ్ వచ్చినట్లు అర్థమవుతోంది. ఇక హీరోయిన్, సినిమా టైటిల్ విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. ఇదిలా ఉంటే. నందమూరి – కొణిదెల – అక్కినేని కుటుంబ హీరోలతో కలిసి నటించిన, నటిస్తున్న ఏకైక హీరోగా దగ్గుబాటి వెంకటేష్ సరికొత్త చరిత్ర సృష్టించారు.

# ఇన్‌స్పైరింగ్ జర్నీ!



సినిమా ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేకుండా నిలబడటం అనేది చాలామందికి కలలా మారిపోతుంది. ప్రతిభ ఉన్నా సరైన అవకాశం దొరక్క వెనక్కి తగ్గే వారు ఎందరో. అయితే కొంతమంది మాత్రమే ఎలాగైనా కష్టపడి సాధించాలనే తపనతో ముందుకు సాగి తమ కలని నెరవేర్చుకుంటారు. అలాంటి వారిలో కోలీవుడ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ పేరు ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. సాధారణ మధ్యతరగతి యువకుడిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు స్టార్ హీరో స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

చిన్నప్పటి నుంచే సినిమాలపై ఇష్టం పెంచుకున్న ప్రదీప్, తన తండ్రి నడిపే చిన్న జిరాక్స్ షాపులో పనిచేస్తూనే అవకాశాల కోసం వెతికారు. ఖాళీ సమయాల్లో షార్ట్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకున్నారు. ఇంజనీరింగ్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే 2015లో 'వాట్సాప్ కాదల్' అనే లఘు చిత్రాన్ని రూపొందించి నటన, ఎడిటింగ్, దర్శకత్వం అన్నింట్లోనూ తన సామర్థ్యాన్ని చూపించారు. ఈ షార్ట్ ఫిల్మ్స్ ద్వారానే ఆయనపై సినీ ఇండస్ట్రీ దృష్టి పడింది. దాని ఫలితంగానే 2019లో 'కోమలి' చిత్రంతో దర్శకుడిగా వెండితెరపై అడుగుపెట్టారు. తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకుని తనదైన ముద్ర వేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు అందిన రెమ్యునరేషన్ రూ.50 లక్షలే అయినా అది ఆయనకు పెద్ద గుర్తింపునిచ్చింది. దర్శకుడిగా విజయాన్ని అందుకున్న తర్వాత తనలోని నటుడిని ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకున్న ప్రదీప్ స్వీయ దర్శకత్వంలో 'లవ్ టుడే' మూవీని తెరకెక్కించారు. ఈ వరుస విజయాలతో ప్రదీప్ రంగనాథన్ యూత్‌లో మినిమమ్ గ్యారెంటీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. కథల ఎంపికలో కొత్తదనం, సహజ నటన, యూత్‌ను ఆకట్టుకునే డైలాగ్స్, మేనరిజం ఆయనకి ప్రత్యేకమైన ఫాలోయింగ్ తెచ్చాయి. ముఖ్యంగా సోషల్ మీడియా తరం ఎమోషన్స్‌ని పట్టుకుని సినిమాలు చేయడంలో ఆయనకు ఉన్న పట్టు ట్రేడ్ వర్గాల్ని ఆశ్చర్యపరుస్తోంది. రెమ్యునరేషన్ పరంగా చూస్తే ఆయన ఎదుగుదల మరింత షాకింగ్‌కి గురిచేయక మానదు. తొలి సినిమా 'కోమలి'కి రూ.50 లక్షలు తీసుకున్న ప్రదీప్, 'డ్యూడ్' సమయానికి రూ.10 కోట్లకు పైగా పారితోషికం అందుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఆయన క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని బడా బ్యానర్లు ఏకంగా రూ.25 కోట్ల వరకు ఇవ్వడానికి ముందుకొస్తున్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏడేళ్లలో ఈ స్థాయి జంప్ సాధించడం నిజంగా అరుదైన విషయమే.

ప్రస్తుతం స్టార్ దర్శకుడు విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'లో ప్రదీప్ నటిస్తున్నారు. ఇందులో ఆయనకు జోడిగా కృతి శెట్టి నటిస్తుండగా, ఎస్.జె. సూర్య కీలక పాత్రలో కనిపించనున్నారు. మార్చిలో విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. సాధారణ యువకుడిగా మొదలై కోట్లాది అభిమానుల మనసు గెలుచుకున్న ప్రదీప్ రంగనాథన్ ప్రయాణం... కష్టపడితే అసాధ్యం కానిదేదీ లేదని చెప్పే స్ఫూర్తిదాయక కథగా నిలుస్తోంది. ఒక బయోపిక్‌కి సరిపడా ట్విస్టులన్నీ ఆయన నిజ జీవిత కథలో కనిపిస్తున్నాయి. అన్నీ కుదిరితే అతడి జీవిత ప్రయాణం వెండితెరపై బయోపిక్‌గా వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

# కొత్త నిర్వచనం



పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ ఆ అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి. పవన్ హ్యాట్ ధరించి స్టైలిష్ గా కనిపిస్తున్న పోస్టర్, సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. విడుదలైన క్షణాల్లోనే వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియులు పవన్ కళ్యాణ్ అద్భుతమైన లుక్ కి ఫిదా అవుతున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఏ అప్డేట్ వచ్చిన చక్కని ఆదరణ లభిస్తోంది. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్న ప్రేమాభిమానాలతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, త్వరలోనే చిత్రానికి సంబంధించిన పవర్‌ప్యాక్డ్ 40 సెకన్ల గ్లింప్స్‌ను విడు దల చేయడానికి నిర్మాతలు సిద్ధమవు తున్నారు. దీనితో మాస్ ఎలిమెంట్స్‌ను ప్రేక్షకు లకు చూపించనున్నారు. ఈ గ్లింప్స్ అభిమాను లకు అసలు సిసలైన మాస్ విందుని అందించ నుంది. ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్‌ను మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో చూపించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు దర్శకుడు. అన్ని అంశాల మేళవింపుతో పూర్తి వినోదభరిత చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ తన సంగీతంతో చిత్రానికి మరింత హై వోల్టేజ్ ఎనర్జీని అందిస్తున్నారు. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, ఉత్సాహం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, 'ఉస్తాద్ భగత్ సింగ్' మరోసారి మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి సిద్ధంగా ఉంది' అని మేకర్స్ చెబుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా

# రజనీకాంత్ కొడుకుగా




లోకనాయకుడు కమల్‌హాసన్ నిర్మాణంలో, సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం, కమల్ హాసన్ స్వంత బ్యానర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై రూపొందనుంది. దశాబ్దాల తర్వాత తమిళ సినీ ప్రపంచంలోని ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే ప్రాజెక్ట్ కోసం చేతులు కలపడం విశేషంగా మారింది. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో అంచనాలను మరింత పెంచుతోంది."ప్రతి కుటుంబంలోనూ ఒక హీరో ఉంటాడు" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ప్రాజెక్ట్ ఎమోషన్స్‌తో కూడిన పవర్‌ఫుల్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుందనే టాక్ వినిపిస్తోంది. తాజా ప్రచారం ప్రకారం మలయాళ సినీ రంగానికి చెందిన నటుడు-దర్శకుడు బసిల్ జోసెఫ్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని తెలుస్తోంది.


రజనీకాంత్‌కు కుమారుడి పాత్రలో ఆయన కనిపించనున్నారనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అదే సమయంలో మరో కీలక పాత్ర కోసం ప్రియాంక అరుళ్ మోహన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బసిల్ జోసెఫ్ విషయానికి వస్తే, ఆయన కేవలం దర్శకుడిగానే కాదు, ప్రతిభావంతమైన నటుడిగానూ మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. 2013లో సహాయ దర్శకుడిగా సినీ ప్రయాణం ప్రారంభించిన బసిల్, తరువాత కుంజిరామాయణం, గోధా, మిన్నల్ మురళి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రత్యేక ముద్ర వేశారు. ముఖ్యంగా 'మిన్నల్ మురళి' విజయంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా వినిపించింది.

నటుడిగా కూడా జోజి, జాన్.ఇ.మ్యాన్, జయ జయ జయ జయ హే, పల్తు జాన్వర్, ఫలిమి వంటి సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల తమిళ చిత్రం 'పరాశక్తి' క్లైమాక్స్‌లో ఆర్మీ ఆఫీసర్‌గా తళుక్కుమన్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన క్రేజ్‌ను మరింత పెంచుకుంటున్న బాసిల్, ఇప్పుడు రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం దక్కితే అది ఆయన కెరీర్‌లో కీలక మలుపు అవుతుందనే చెప్పాలి. మొత్తానికి 'రజనీ 173'పై రోజురోజుకీ పెరుగుతున్న అంచనాల మధ్య, నటీనటుల ఎంపికపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# అదరగొట్టాడుగా..



స్టార్ హీరోగా కోట్లాది అభిమానులను సంపాదించిన జూ. ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం చాలా గోప్యంగా ఉంచుతారు. కుటుంబానికి సంబంధించిన విషయాలు అంతగా బయటకు రానివ్వరు. కాకనోతే ఫంక్షన్లు, విహార యాత్రలకు వచ్చి పోయే సందర్భాల్లో వారి ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చి కొద్ది రోజుల పాటు సోషల్ మీడియాల్లో హడావుడి చేస్తుంటాయి. అభిమానులు ఊడా వాటిని అపురూపంగా పరిగణిస్తూ వాటిని ఇతరులతో పంచుకుంటుంటారు.

ఎన్టీఆర్‌కు ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు అభయ్ రామ్ (11) , చిన్న కుమారుడు భార్గవ్ రామ్ (7) ఇద్దరూ హైదరాబాద్ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిసింది. కాగా ఇటీవల వీరికి సంబంధించిన ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. స్కూల్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో భార్గవ్ రామ్ పాల్గొనగా తన చేతిలో అప్పుడే వేసిన ఏనుగు పెయింటింగ్‌ను పట్టుకుని నిలబడ్డాడు. ఈ ఫొటో కాస్త బయటకు రావడంతో ఫ్యాన్స్ ఆ ఫొటోను తెగ వైరల్ చేస్తున్నారు. భార్గవ్ రామ్ డ్రాయింగ్‌కు అభినందనలు తెలుపుతున్నారు.

